ప్రభాత జయభేరి
తెలుగు దినపత్రిక
jayabheridaily.com
15-06-2024
శనివారం
మల్కాజిగిరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
సంపుటి : 01 | సంచిక : 293 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..

ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం

అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత

jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889

జయభేరి



# ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు షురూ

✍ **జయభేరి, హైదరాబాద్, జూన్ 14:**

తెలంగాణలో మరో పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇన్నాళ్లూ ఎన్నికల కోడ్ కారణంగా ముందు కదలని ప్రక్రియను ఇప్పుడు వేగవంతం చేసి ప్రజల కళ్లల్లో సంతోషాన్ని నింపాలని భావిస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో పేదలకు ఇల్లు ఒకటి. ఇప్పటికే ప్రజాపాలన పేరుతో అర్హుల నుంచి అప్లికేషన్లు తీసుకున్నారు. ఇప్పుడు వాటి దుమ్ముదులిపే పనిలో పడ్డారు అధికారులు ఇందిరమ్మ ఇళ్లు కావాలని అభ్యర్థిస్తూ 83 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని ఇప్పటి వరకు స్క్రూటినీ చేయలేదు. ఇప్పుడు వాటిని వడపోసి అసలైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేస్తారు. ఓవైపు ఈ ప్రక్రియ సాగుతుండగానే మరో వైపు అసలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎలా ఉండాలనే అంశంపై అధ్యయనం ప్రారంభిస్తున్నారు. బీఆర్ఎస్

...మిగతాది 2 లో

# విస్తరణకు రెడీ..
## భారమంతా అధిష్టానంపైనే



**తెలంగాణ మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉండే అవకాశాలున్నాయి. ఎప్పుడైనా మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశముందని చెబుతున్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కసరత్తులు పూర్తి చేసినట్లు తెలిసింది. ఢిల్లీ పెద్దల నుంచి మంత్రివర్గ విస్తరణకు సంబంధించి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.**

✍ **జయభేరి, హైదరాబాద్, జూన్ 14:**

తెలంగాణ మంత్రివర్గంలో ఇంకా ఆరు స్థానాలు ఖాళీగానే ఉంచారు. అనేక శాఖలను పలువురు మంత్రులు చూస్తున్నారు. ఇది వారికి కొంత ఇబ్బందిగా మారింది. దీంతో పాటు కొన్ని సామాజికవర్గాలకు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో ఈసారి వారికి అవకాశమివ్వాలని నిర్ణయించారని తెలిసింది. ఇటీవల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరయిన రేవంత్ ఈ మేరకు విస్తరణకు సంబంధించిన హామీని పొందినట్లు చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా దగ్గరపడుతుండటంతో రేవంత్ రెడ్డి త్వరగానే విస్తరణకు రెడీ అవుతున్నారని తెలిసింది.తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు కసరత్తు జరుగుతోంది. ఇదే విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ఆగస్టు 15వ తేదీలోపు పూర్తిస్థాయి మంత్రివర్గం ఉండాలని రేవంత్ భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిపి పన్నెండు మంది మాత్రమే

...మిగతాది 2 లో




# జీహెచ్ఎంసి పరిధిని పెంచవద్దు

✍ **జయభేరి, హైదరాబాద్:**

కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిని పెంచే ప్రతిపాదనను బీజేపీ పార్టీ వ్యతిరేకిస్తుందని, తద్వారా రంగారెడ్డి జిల్లా ఉనికి దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, బొక్క నర్సింహ్మారెడ్డి. రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మల్లారెడ్డిలు అన్నారు. ఈ మేరకు హిమాయత్ నగర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 21 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్స్ జీహెచ్ఎంసీ విలీనం చేయాలనీ చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

...మిగతాది 2 లో




# రుణమాఫీపై కొత్త గైడ్ లైన్స్

✍ **జయభేరి, హైదరాబాద్, జూన్ 14:**

రుణమాఫీ స్కీమ్ పై తెలంగాణ సర్కార్ కసరత్తు చేస్తోంది. ఆగస్టు 15వ తేదీలోపు రూ. 2 లక్షల లోపు రైతు రుణాలను మాఫీ చేస్తామని గత కొద్దిరోజుల కిందట సీఎం రేవంత్ రెడ్డి పదే పదే చెప్పిన సంగతి తెలిసిందే. ఎన్నికలు ముగియటంతో రుణమాఫీపై రేవంత్ సర్కార్___గట్టిగా ఫోకస్ చేసే పనిలో పడింది. రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేసిన నేపథ్యంలో... ఏ విధంగా అమలు చేస్తారనే దానిపై రైతుల్లో అనేక సందేహాలు

...మిగతాది 2 లో

# కేటీఆర్, హరీష్ కు నోటీసులు...?

✍ **జయభేరి, కరీంనగర్, జూన్ 14 :**



కాళేశ్వరం ప్రాజెక్టుపై బహిరంగ విచారణకు రెడీ అవుతోంది జస్టిస్ చంద్రఘోష్ కమిషన్. ఈ ఎపిసోడ్‌లో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌కు నోటీసులు ఇవ్వబోతోందని టాక్. త్వరలో మరోసారి ఆకస్మిక పర్యటనలకు రెడీ అవుతోంది కమిషన్. నిన్న హైడ్రాలజీ, నిపుణుల కమిటీలను విచారించిన జస్టిస్ ఘోష్.. నేడు ఇంకొందరిని పిలిచింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన ఆరోపణలపై జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ విచారణ వేగవంతంగా కొనసాగుతోంది. హైడ్రాలజీ, నిపుణుల కమిటీ ఇంజినీర్లను కమిషన్ విచారించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో తాము ఐడెంటీఫై చేసిన అంశాలను వివరించిన రెండు కమిటీలు.. ఎక్కువ నీటిని నిల్వ చేయడం వల్లే సమస్య తలెత్తిందని చెప్పినట్టు తెలుస్తోంది. రెండు వారాల లోపు మధ్యంతర

...మిగతాది 2 లో



# తిహార్ జైలులో కవితతో కేటీఆర్

✍ **జయభేరి, హైదరాబాద్ :**

ఢిల్లీలోని తీహార్ జైలులో కవితతో కేటీఆర్ ములాఖత్ అయ్యారు. మర్యాదపూర్వకంగా కవితను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సీబీఐ నమోదు చేసిన కేసులో ఈ నెల 21 వరకు ఆమెకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు చదువుకోవడానికి తొమ్మిది పుస్తకాలు కావాలని కోర్టుని కోరగా, అందుకు న్యాయస్థానం అనుమతించింది. తదుపరి విచారణ ఈ నెల 21న జరగనుంది. ఆమెను కలిసిన తర్వాత కేటీఆర్ హైదరాబాద్‌కు తిరుగు పయనం అయ్యారు.


# జులై 22న కేంద్ర బడ్జెట్?

✍ **జయభేరి, న్యూఢిల్లీ జూన్ 14:**

పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు షెడ్యూల్ ఖరారయిందని తెలుస్తోంది. ఇవి జులై 22 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు జరుగనున్నట్లు తెలుస్తోంది. కాగా తొలి రోజే కేంద్రం పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనుందని సమాచారం. ఈ విషయాన్ని విశ్వసనీయ వర్గాలు తెలిపినట్లు కథనం.కొత్తగా ఏర్పడిన 18వ లోక్ సభ సమావేశాలు జూన్ 24 నుంచి జులై 3వ తేదీ వరకు జరుగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. తొలి విడత సమావేశంలో సభ్యుల ప్రమాణస్వీకారం, స్పీకర్ ఎన్నికకు పట్టే సమయాన్ని మినహాయిస్తే పనిదినాలు కేవలం 5 రోజులే ఉంటాయి. ఈ స్వల్పకాలంలో బడ్జెట్ ప్రవేశపెట్టి, దానిపై చర్చించడం సాధ్యం కాదని భావించిన కేంద్రం వర్షకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

# వయనాడ్ ఎంపిగా ప్రియాంకా గాంధీ పోటీ ?

✍ **జయభేరి, న్యూ డిల్లీ:**



కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంకా గాంధీ వయనాడ్ ఎంపిగా పోటీ చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. కేరళలోని వయనాడ్, యూపీలోని రాయ్ బరేలీ రెండు పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసి గెలుపొందిన సంగతి తెలిసిందే.అయితే, రాహుల్ వయనాడ్ స్థానానికి రాజీనామా చేయనున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ స్థానం నుంచి ప్రియాంకా గాంధీ బరిలోకి దిగనున్నట్లు సమాచారం. కాగా, ఎన్నికల్లో ప్రియాంకా గాంధీ..కాంగ్రెస్ తరుపున విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే, ఆమె ఇంతవరకు ఎన్నికల్లో పోటీ చేయలేదు.

# నాన్నను లేపేసిందోచ్

- మదనపల్లిలో దాష్టీకం...
- ఇద్దరి ప్రియుల ముద్దుల గుమ్మ
- ఒకడికి రూ.10లక్షల సుఫారి




2 లో

**- జయభేరి, అన్నమయ్య :**

**తనకు నచ్చని పెళ్లికి సిద్ధమయ్యాడని కన్న తండ్రినే ఓ బిడ్డ కడతేర్చిన ఘటన సభ్య సమాజాన్ని కలచి వేసింది. తప్పటడుగుల ప్రాయంలో చిటికిన వేలుతో నడక నేర్పి,, కౌమార దశలో కంటికి రెప్పలా కాపాడిన తండ్రి మమకారం..ప్రియుడి ప్రేమమత్తులో ఆ కూతురుకు గుర్తుకురాలేదా? అని మదనపల్లి జనం తమను తాము ప్రశ్నించుకునే దారుణ ఘటన ఇది.**

# ఖమ్మం అధికారి రాసలీలలు

- విచారించి వదిలేసిన టాస్క్ ఫోర్స్ పోలీసులు..?



2 లో

**- జయభేరి, హన్మకొండ :**

**ఖమ్మం జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఓ పోలీసు ఇన్స్పెక్టర్ పాడు పనికి ఒడిగట్టాడు. యువతితో రాసలీలలు సాగిస్తూ పోలీసులకు చిక్కాడు. ఈ ఘటన హనుమకొండ నగరంలోని చింతగట్టు సమీపాన ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం చోటు చేసుకుంది. సోషల్ మీడియాలో వైరల్ మారిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. వరంగల్ జిల్లాకు చెందిన సదరు అధికారి ఖమ్మం జిల్లాలో ఎస్ఐబీ విభాగంలో ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్నాడు.**

▸▸ మొదటిపేజీ తరువాయి

## నాన్నను లేపేసిందోచ్

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో బుధవారం తెల్లవారు జామున ఈ ఘాతుకం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి పట్టణంలోని ఎగువ కురవంక ఆంజనేయ స్వామి గుడి సమీపంలోని పోస్టల్ అండ్ టెలికమ్ కాలనీలో జీఆర్టీ స్కూల్ టీచర్ దొరస్వామి నివసిస్తున్నారు. ఆయన భార్య లత ఏడాదిన్నర కిందట చని పోయారు. అప్పటి నుంచి తన ఒక్కగాని ఒక్క గారాల పట్టి హరిత (25) ను కంటికి రెప్పలా దొరస్వామి కాపాడుతున్నారు. ఆమె బీఎస్సీ బీఈడీ చదివింది. త్వరలో టీచర్ ఉద్యోగం నుంచి రిటైర్ కానున్నారు. ఉద్యోగ విరమణతో వచ్చే డబ్బుతో ..తల్లి లేని బిడ్డకు వైభవంగా పెళ్లి చేసి మెట్టినింటికి పంపించాలని నిర్ణయం తీసుకున్నారు. కుప్పంలో ఓ కుటుంబంతో సంబంధం కుదిర్చారు. సుమారు రూ.80లక్షల విలువ చేసే రెండు అంతస్తుల భవనం ఆస్తిని ఈ మధ్యనే తన కూతురుకు పసుపు కుంకుమగా రిజిస్ట్రేషన్ చేశారు. ఆయనకు మద్యం అలవాటు ఉంది. బుధవారం రాత్రి మద్యం తాగి నిద్ర పోయారు. ఉదయం చూసే సరికి రక్త మడుగులో దొరస్వామి శవం కనిపించింది. మదనపల్లి పోలీసులకు ఈ సమాచారం అందింది. డీఎస్పీ ప్రసాద్ రెడ్డి వన్ టౌన్, తాలుకా సీఐలు వల్లి బసు , శేఖర్, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కీలక ఆధారాలు సేకరించారు.

**ప్రియుడికి రూ.10 లక్షల సుపారీ**

మాస్టార్ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదిస్తున్నారు.అంత్యంత గోప్యంగా అందిన పోలీసుల దర్యాప్తు సమాచారం మేరకు.. కన్నకూతురే అత్యంత క్రూరంగా చంపిందని, ఇందుకు ఇద్దరు ప్రియులను వినియోగిందనే సమాచారం బయటకు పొక్కింది. ఎందుకంటే.. . దొరస్వామి హత్య జరిగిన సమయంలో కుమార్తె హరిత ఇంటిలోనే ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తులు చంపేశారని చెప్పింది. ఆ సమయంలో ఘర్షణ వినపడలేదా? దెబ్బల శబ్ధం వినపడలేదా? ఇలాంటి ప్రశ్నలు సంధించే సరికి.. తన తండ్రి దొరస్వామిని తానే చంపానని హరిత పోలీసులకు తెలిపింది. దొరస్వామి తనపై లైంగిక వేదింపులకు పాల్పడినట్టు ఆమె వినిపించిన కథను దర్యాప్తు అధికారులు నమ్మలేదు. మరిన్ని ప్రశ్నలు సంధించగా... అసలు ప్రియుల కథను విప్పిందని తెలుస్తోంది. తనకు ఇద్దరు ప్రియులు ఉన్నారు. పై అంతస్తులో రహస్యంగా సహజీవనం చేస్తుంది. రోజుకు ఒకరు పై అంతస్తుకు వస్తారు. కింది అంతస్తులోని దొరస్వామికి ఈ విషయాన్ని స్థానికులు తెలిపారు. పెళ్లి చేసి పంపించాలని నిర్ణయానికి వచ్చారు. వేరే వ్యక్తితో తనకు పెళ్లి వద్దని హరిత ఎదురు తిరిగింది. తండ్రి ఒప్పుకోలేదు. దీంతో అతడిని హతమార్చటానికి హరిత సిద్ధమైంది. ఒక ప్రియుడికి రూ.10లక్షల సుఫారీ ఇచ్చింది. అంతే దొరస్వామిని హతమార్చారు. ఈ ఘటన జరిగిన సమయంలో ఓ ప్రియుడు తిరుమలలో వెంకన్న దర్శనం క్యూలో ఉన్నాడు. మరొక ప్రియుడి ఫోన్ ఆధారంగా ఎక్కడ ఉన్నాడో పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు. చపాతీల కర్రతో.. ఇనుప రాడ్డుతో తానే కొట్టి చంపానని నిందితురాలు పోలీసులకు చెప్పిట్టు సమాచారం. కానీ.. ఒంటరిగా ఆమె మాత్రమే హత్య చేసే అవకాశం లేదని, కనీసం ఇద్దరు ముగ్గురు సహకరించినట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఆమె చెప్పిన కొన్ని విషయాలపై మరిన్ని అనుమానాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఉత్తమ ఉపాధ్యాయుడిని కన్నకూతురే హతమార్చినట్టు పోలీసులు ఓ నిర్ణయానికి వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది.

## ఖమ్మం అధికారి రాసలీలలు

2009లో కానిస్టేబుల్గా విధుల్లో చేరిన ఆయన 2014లో ఎస్సైగా, ఆతర్వాత ఇన్స్పెక్టర్ గా పదోన్నతి పొంది ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్నాడు. ఆ ఇన్స్పెక్టర్కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. అయితే, మంగళవారం సదరు ఇన్స్పెక్టర్ తన ప్రియురాలితోపాటు మరికొందరు స్నేహితులతో కలిసి చింతగట్టు సమీపాన ఫంక్షన్ హాల్లో విందు ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఓ గదిలో స్నేహితులు మద్యం సేవిస్తుండగా, ఇంకో గదిలో యువతితో ఆ సీఐ రాసలీలల్లో మునిగి తేలినట్లు తెలిసింది. ఈ విషయం టాస్క్ ఫోర్స్ పోలీసులకు తెలియడంతో వారు వెళ్లి యువతితో ఉన్న పోలీస్ ఇన్స్పెక్టర్ ను చూసి షాక్కు గురైనట్లు సమాచారం. అయితే, టాస్క్ ఫోర్స్ పోలీసులను గమనించిన ఇన్స్పెక్టర్ స్నేహితులతోపాటు యువతి పారిపోయినట్లు తెలిసింది. దీంతో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి వదిలిపెట్టినట్లు సమాచారం. అయితే, సదరు ఇన్స్పెక్టర్ స్నేహితులను, యువతిని పోలీసులే తప్పించారా లేక పరారయ్యారా అన్నది చర్చ జరుగుతోంది. ఈ విషయమై పోలీసులను సంప్రదించడానికి ప్రయత్నించగా ఎవరూ అందుబాటులోకిరాలేదు.

## విస్తరణకు రెడీ..

కేబినెట్ లో ఉన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఏర్పడిన తొలి మంత్రివర్గంలో పన్నెండు మందికే స్థానం దక్కింది. మరికొందరికి అవకాశం ఇవ్వాలని ఆలోచించినా లోక్సభ ఎన్నికల తర్వాత మిగిలిన స్థానాలను భర్తీ చేయాలన్న ఆలోచనలో హైకమాండ్ ఉంది. లోక్సభ ఎన్నికల్లో అందరూ కలసి పనిచేసేందుకు కొన్ని ఖాళీలను కావాలని అలాగే ఉంచారు. మంత్రివర్గంపై ఎందరో ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరం నుంచి గత ఎన్నికల్లో ఒక్కరూ కాంగ్రెస్ నుంచి గెలవలేదు. మొన్న కంటోన్మెంట్ లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గణేష్ విజయం సాధించారు. లోక్సభ ఎన్నికలు పూర్తి కావడంతో విస్తరణ చేపట్టాలని ఆలోచిస్తున్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో రెడ్డి సామాజికవర్గం నుంచి నలుగురు మంత్రులుండగా, ఎస్సీ, బీసీ సామాజికవర్గాల నుంచి ఇద్దరు, ఎస్టీ, కమ్మ, వెలమ సామాజికవర్గాల నుంచి ఒక్కొక్కరు లెక్కన కేబినెట్ లో చోటు దక్కింది. అయితే ఈసారి విస్తరణలో మైనారిటీలకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. మైనారిటీకి చెందిన వారిని ఎమ్మెల్సీగా చేసి కేబినెట్ లో చోటు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. దీంతో పాటు ముదిరాజ్ వర్గానికి చెందిన వారికి కూడా ఈసారి కేబినెట్ లో ఛాన్స్ దక్కే అవకాశాలున్నాయి. అయితే ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి మంత్రి పదవి ఇచ్చే ఆలోచనలో మాత్రం కాంగ్రెస్ నాయకత్వం లేదు. అది పార్టీ క్యాడర్ లోకి తప్పుడు సంకేతాలు పంపుతుందని భావిస్తున్నారు. అందుకే పార్టీకి గత ఎన్నికల్లో పనిచేసిన వారికే కేబినెట్ లో చోట కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎవరికీ మంత్రి పదవి దక్కలేదు. ఈ జిల్లా నుంచి ఒకరికి అవకాశం ఉండనుంది. నిజామాబాద్ జిల్లా నుంచి కూడా ఈసారి కేబినెట్ లో ఒకరికి ఛాన్స్ ఉంటుందని చెబుతున్నారు. అయితే రెడ్డి సామాజికవర్గాల నుంచి కాకుండా ఇతర సామాజిక వర్గాల వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్న యోచనలో రేవంత్ ఉన్నారు. పార్టీ కోసం పనిచేసి త్యాగాలు చేసిన వారిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఎవరిని నొప్పించకుండా కేబినెట్ కూర్పు చేయాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. అయితే కేబినెట్ విస్తరణ చేసినా రేవంత్ రెడ్డి ఆ నెపాన్ని హైకమాండ్ పైనే నెట్టే అవకాశముంది. తనకు ఏమాత్రం సంబంధం లేదని, హైకమాండ్ సూచన మేరకే తాను విస్తరణ చేశానని చెప్పే అవకాశాలు ఎక్కువ. అయితే ఎక్కువ అసంతృప్తులు చోటు చేసుకోకుండా, మంత్రి పదవి రాని వారికి తర్వాత జరిగే మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పిస్తామన్న హామీ కూడా గట్టిగా ఇవ్వాలన్న నిర్ణయంతో రేవంత్ ఉన్నట్లు తెలిసింది. మొత్తం మీద అతి త్వరలోనే రేవంత్ రెడ్డి తన మంత్రివర్గాన్ని విస్తరించబోతున్నారన్న వార్త తెలిసిన వెంటనే ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

## జీహెచ్ఎంసి పరిధిని పెంచవద్దు

ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిని పెంచాలనే ప్రభుత్వ ప్రతిపాదనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల ప్రాబల్యం కొనసాగడానికి జిహెచ్ఎంసిలో మున్సిపాలిటీలను, కార్పొరేషన్లు విలీనం చేయడానికి అధికారులు పూనుకుంటున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ పరిధిని విస్తరిస్తే హైదరాబాద్ చుట్టు ఉన్నగిరి, మేడ్చల్ జిల్లాలో అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. చెరువులు, కుంటలు కబ్జాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. గతంలో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసేముందు తాము వ్యతిరేకించామని వారు అన్నారు. ప్రభుత్వం పన్నులు వసూలు చేసేందుకు, మజ్లిస్ను సంతృప్తి పరిచేందుకు ఈ నిర్ణయం తీసుకుందని వారు ఆరోపించారు. ఈ నిర్ణయం రాజకీయకోణం మాత్రమే అన్నారు. ఈ అశాస్త్రీయమైన నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. గతంలో జీహెచ్ఎంసీని ఏర్పాటు చేసి హైటెక్ సిటీ లాంటి ప్రాంతాలను మాత్రమే అభివృద్ధి చేసి హైదరాబాద్ను అభివృద్ధి చేశామని చెప్పారాని విమర్శించారు. జిహెచ్ఎంసీల విలీనం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీని విస్తరించే మానుకోవాలని లేని పక్షంలో అన్ని రాజకీయ పార్టీలని కలుపుకుని అడ్డుకుంటామని, దీంతో పాటు లీగల్గా ఎదుర్కొంటామని వారు హెచ్చరించారు.

# నల్గొండ డీసీసీబీ కోసం క్యాంపు రాజకీయాలు..

✍ జయభేరి, నల్గొండ, జూన్ 14:



పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల సమరం ముగిసిందో లేదో అపుడే.. నల్లగొండ జిల్లాలో మరో ఎన్నిక రాజకీయాలను వేడెక్కిస్తోంది. నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్పై అవిశ్వాసం వ్యవహారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఢీ అంటే ఢీ అంటున్నాయి. డీసీసీబీ చైర్మన్పై అవిశ్వాసం తీర్మానాన్ని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అవిశ్వాసం నెగ్గేందుకు కాంగ్రెస్ పార్టీ, వీగిపోయేందుకు బీఆర్ఎస్ పార్టీలు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నాయి. ఇప్పటికే చైర్మన్ పదవిని ఆశిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనుచరుడు కుంభం శ్రీనివాస్ రెడ్డి 15 మంది డైరెక్టర్లతో క్యాంపు రాజకీయాలకు తెర లేపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తమ అనుచరులకు ముఖ్య పదవులను కట్టబట్టే యోచనలో నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 11 మంది ఎమ్మెల్యేలు గెలుచుకున్న కాంగ్రెస్.. డీసీసీబీ పీఠంపై కన్నేసింది. ప్రస్తుతం బీఆర్ఎస్ కు చెందిన గొంగిడి మహేందర్రెడ్డి నల్లగొండ జిల్లా డీసీసీబీ ఛైర్మన్గా కొనసాగుతున్నారు. చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానంతో పదవీ నుంచి దింపాలని కాంగ్రెస్ భావిస్తోంది. నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మన్ గా తన అనుచరుడు కుంభం శ్రీనివాస్ రెడ్డిని చేసేందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చక్రం తిప్పుతున్నారట. డీసీసీబీలో మొత్తం 21 మంది డైరెక్టర్లు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 19 మందే ఉన్నారు. ఇందులో 18 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే. మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్. ఇటీవల డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే బీఆర్ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్లలో తుంగతుర్తికి చెందిన గుడిపాటి సైదులు, భువనగిరికి చెందిన అందెం లింగంయాదవ్, నాగార్జునసాగర్ కు చెందిన ఇరిగినేని అంజయ్య, మిర్యాలగూడకు చెందిన బంటు శ్రీనివాస్, కోదాడకు చెందిన వీరస్వామి, కొండా సైదయ్య, నల్లగొండకు చెందిన పాశం సంపత్ రెడ్డిలు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. చైర్మన్ మహేందర్ రెడ్డి సన్నిహితుడు, యాదగిరిగుట్ట మండలం రామాజీపేటకు చెందిన డీసీసీబీ డైరెక్టర్ రాంచందర్ బుధవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ బలం మరింతగా పెరిగింది. డీసీసీబీ చైర్మన్ రేసులో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనుచరుడు కుంభం శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. 19 మంది డైరెక్టర్లలో అవిశ్వాస తీర్మానానికి అవసరమైన 14 మంది డైరెక్టర్ల మద్దతు కాంగ్రెస్ కూడగట్టింది. డీసీసీబీ చైర్మన్ మహేందర్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటూ 14 మంది డైరెక్టర్లు ఈ నెల 10వ తేదీన అవిశ్వాసం నోటీసును జిల్లా సహకార అధికారి కిరణ్కు అందజేశారు. కోఆపరేటివ్ యాక్ట్ ప్రకారం నోటీసు ఇచ్చాక 15 రోజుల సమయం ఇస్తారు. ఈ నెల 28వ తేదీన అవిశ్వాసం తీర్మానం పై ఓటింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గి.. డీసీసీబీ చైర్మన్గా కుంభం శ్రీనివాస్ రెడ్డిని చేసేందుకు కోమటి రెడ్డి బ్రదర్స్ పట్టుదలతో ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్లను అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం ప్రారంభించడంతోపాటు క్యాంపు రాజకీయాలకు హస్తం పార్టీ తెర తీసింది. డీసీసీబీ చైర్మన్కు వ్యతిరేకంగా డైరెక్టర్ కుంభం శ్రీనివాస్రెడ్డి 13 మంది డైరెక్టర్లు, వైస్ చైర్మన్ దయాకర్రెడ్డి మద్దతు కూడగట్టారు. కుంభం శ్రీనివాస్రెడ్డి నేతృత్వంలో 13 మంది డైరెక్టర్లు కర్ణాటకలో క్యాంపునకు తరలి వెళ్లారు. వీరంతా జూన్ 28న జరిగే ఓటింగ్ రోజున రానున్నారు. డీసీసీబీ చైర్మన్ పై అవిశ్వాస తీర్మానాన్ని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ప్రస్తుతం 19 మంది డైరెక్టర్లలో కాంగ్రెస్ పార్టీకి వైస్ చైర్మన్ సహా పది మంది డైరెక్టర్లు ఉన్నారు. మిగితా 9 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే. దీంతో కాంగ్రెస్ బలం 10కి చేరగా, బీఆర్ఎస్ బలం 9కి తగ్గింది. అవిశ్వాస తీర్మానం నెగ్గించి, ఎలాగైనా డిసిసిబీ పీఠాన్ని కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.

అవిశ్వాసం వీగిపోయేలా చేసేందుకు మహేందర్రెడ్డి కసరత్తు చేస్తున్నారు. తమ నుంచి వెళ్లిపోయిన ఐదుగురు ఇంకా బీఆర్ఎస్ పార్టీకి చెందినవారేనని, అవిశ్వాసం ఓటింగ్లో తనకు మద్దతుగా నిలుస్తారని గొంగిడి ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్కు 14 మంది డైరెక్టర్ల మద్దతు ఉంటేనే అవిశ్వాసం నెగ్గుతుంది. కాంగ్రెస్ వైపు వెళ్లిన వారిలో ఇద్దరిని వెనక్కి లాకుంటే, కాంగ్రెస్ బలం 13 అవుతుంది. దాంతో అవిశ్వాసం వీగిపోనుంది. ఆ దిశగా మహేందర్రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. అప్పుల్లో ఉన్న డీసీసీబీ బ్యాంకును లాభాల్లోకి తీసుకువచ్చి, బ్యాంకు ప్రతిష్ఠను పెంచానని చైర్మన్ మహేందర్ రెడ్డి చెబుతున్నారు. తన హయాంలో జరిగిన బ్యాంక్ అభివృద్ధి గురించి డైరెక్టర్లందరికీ తెలుసని అన్నారు. కాంగ్రెస్ క్యాంప్ లో ఉన్న డైరెక్టర్లలో సగం మంది తనకు మద్దతు ఇస్తారని, అవిశ్వాస తీర్మానం వీగిపోతుందని మహేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 19 మంది డైరెక్టర్లలో 14 మంది ఛైర్మన్కు వ్యతిరేకంగా ఉన్నారని, నైతికంగా ఆయన పదవీలో కొనసాగే అర్హత లేదని చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్న డైరెక్టర్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చైర్మన్ గొంగిడి మహేందర్రెడ్డి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, 14 మంది డైరెక్టర్లు అవిశ్వాసం కోల్పోయిన మహేందర్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలావుంటే, వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి డీసీసీబీ పదవీకాలం ముగియనుంది. కొత్తగా ఏర్పడే పాలకవర్గం ఏడు మాసాలపాటు పదవి కాలం ఉంటుంది. టెస్కాబ్ చైర్మన్, వైస్ చైర్మన్ లపై అవిశ్వాసానికి కాంగ్రెస్ సిద్ధం కావడంతో చైర్మన్ వైస్ చైర్మన్ పదవులకు రవీందర్ రావు, గొంగిడి మహేందర్ రెడ్డిలు ఇప్పటికే రాజీనామా చేశారు. నల్లగొండ డీసీసీబీ చైర్మన్ అవిశ్వాస తీర్మానం జిల్లాలో ఆసక్తికరంగా మారింది.

# పెద్ద ప్లాన్ లో మల్లారెడ్డి

✍ జయభేరి, హైదరాబాద్, జూన్ 14 :

ఏపీలో బంపర్ మెజార్టీతో చారిత్రక విజయం నమోదు చేసింది టీడీపీ. ఈ సారి ఎన్నికల్లో పోటీచేయని టీడీపీ తెలంగాణలో దాదాపు మూతపడింది. దాంతో ఇప్పుడు సైకిల్ పార్టీకి తెలంగాణంలో డిమాండ్ పెరుగుతున్నట్లు కనిపిస్తుంది. కాంగ్రెస్లో చేరదామంటే అక్కడ తలుపులు తెరుచుకోని బీఆర్ఎస్ నేతలకు టీడీపీనే దిక్కులా కనిపిస్తుందంట. అలాంటి వారిలో మాజీ మంత్రి మల్లారెడ్డి ముందు వరుసలో కనిపిస్తున్నారు. సైకిల్ ఎక్కేందుకు ఆయన చంద్రబాబు నాయుడుతో మంతనాలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నారంట. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కారు దిగి సైకిల్ ఎక్కేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. అందుకు మేడ్చల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ముఖ్య నేతలతో రహస్య మీటింగ్ ఏర్పాటు చేసి సమాలోచనలు జరిపారంట. ఆస్తుల రక్షణకు మల్లారెడ్డి తెలంగాణలో సరికొత్త రాజకీయానికి తెరలేపే ఆలోచనలో ఉన్నారంట. మల్లారెడ్డి టీడీపీలోకి వెళ్తే ఆయనతో పాటుగా మరికొందరు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా వెళ్తారని జోరుగా ప్రచారం జరుగుతుంది. వ్యాపార వేత్తగా ఉన్న మల్లారెడ్డి 2014లో రాజకీయ ఆరంగేట్రం చేసి తెలుగుదేశం నుంచి మల్కాజ్గిరి ఎంపీగా గెలిచి.. ఏడాదిన్నరకే బీఆర్ఎస్ లో చేరారు. తర్వాత మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలిచి.. కేసీఆర్ సర్కారులో ఇష్టారాజ్యంగా చక్రం తిప్పారు. పార్టీ మారినా టీడీపీ అధినేతతో చంద్రబాబునాయుడుతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారంట ఆయన. 2024 శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయినా.. మేడ్చల్ నియోజవర్గం నుండి మల్లారెడ్డి గెలిచారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆ పార్టీలోకి వెళ్లేందుకు మల్లారెడ్డి, ఆయన అల్లుడు మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విశ్వప్రయత్నాలు చేశారు. కర్ణాటక వెళ్లి డిప్యూటీ సీఎం డీకే శివ కుమార్తో రాయబారాలు నడపాలని చూశారు. ఆ క్రమంలో లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల అవగానే మల్లారెడ్డి తన కుమారుడు భద్రారెడ్డికి మల్కాజ్ గిరి కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డారు. ఇక చేసేది ఏం లేక బిఆర్ఎస్ లోనే కొనసాగుతానని స్టేట్మెంట్లు ఇచ్చి సైలెంట్ అయ్యారు. మొదట నుండి మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో అక్రమాలు జరుగుతున్నాయి అని విమర్శలు ఉండేవి. తాను



మంత్రిగా ఉన్నంత కాలం ఒక్కటి బయటకు రాకుండా మేనేజ్ చేస్తూ.. కాలేజ్ చుట్టూ పక్కల భూములను కబ్జాలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారం కోల్పోయిన వెంటనే మల్లారెడ్డి అక్రమాలు అన్ని ఒక్కటిగా బయటకు వస్తుండడంతో వాటిని కప్పిపుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు మల్లారెడ్డి.. ఇలాంటి సమయంలో మరెన్నో అక్రమాలు బయటకు వచ్చే అవకాశం ఉండడంతో అటు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అవకాశం లేక ఇటు బీజేపీలోకి పోలేక.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే.. టీ టీడీపీలో చేరి పార్టీ అధ్యక్ష పదవి చేపట్టాలని చూస్తున్నారంట. సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం అయిన తరువాత మల్లారెడ్డి ఆయన అపాయింట్మెంట్ అడిగేందుకు సిద్ధం అయ్యారంట. ఒకవేళ చంద్రబాబునాయుడు కరుణించి మల్లారెడ్డి టి.టిడీపీలోకి వెళ్లే.. ఆయనతో పాటు మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా సైకిల్ సవారీకి రెడీగా ఉన్నట్లు గట్టిగానే వినిపిస్తుంది. తన ఆస్తులను కాపాడుకునేందుకే మల్లారెడ్డి టి. టీడీపీలోకి వెళ్తున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. ఎన్డీఏ కూటమిలో చంద్రబాబు నాయుడు కీలకంగా ఉండటంతో.. టీడీపీలోకి వస్తే తన ఆస్తులకు ఎటువంటి హాని ఉండదని మల్లారెడ్డి లెక్కలు వేసుకుంటున్నారంట. ఏ ఎండకి ఆ గొడుగు పట్టడం ఆయనకు అలవాటేగా.

## ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు

ప్రభుత్వం ఉన్నప్పుడు డబుల్ బెడ్రూమ్ పేరుతో ఇళ్లు నిర్మించి ఇచ్చారు. ఇప్పుడు వాటి స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. తాత్కాలిక బడ్జెట్ లో కూడా దీనికి నిధులు కేటాయించింది. ఈ పథకం కోసం 7740 కోట్లు కేటాయించారు. అంతే కాకుండా ఈ పథకాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి ఖమ్మంలో ప్రారంభించారు. ఈ పథకానికి హడ్కో వెయ్యికోట్ల రుణాన్ని కూడా మంజూరు చేసింది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు ముందుక సాగలేదు. ఇప్పుడు వాటిని జెట్ స్పీడ్తో పూర్తి చేయాలని భావిస్తున్నరు. వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్ల నమూనాలు పరిశీలించనున్నారు. ఆయా రాష్ట్రాల్లో లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణం, వాటి కోసం చెల్లిస్తున్న నిధులు అన్నింటిపై అధ్యయనం చేసి ఓ సరికొత్త మోడల్ను తయారు చేయనున్నారు. దాని ప్రకారం పథకాన్ని పూర్తి చేయాలని కాంగ్రెస్ సర్కారు భావిస్తోంది. దీని కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. ఏడాదికి నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన. దానికి తగ్గట్టుగానే నిధులు కేటాయిస్తోంది. ఐదేళ్లలో ఇరవై లక్షలకు పైగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నది ప్లాన్. ఒక్కో నియోజకవర్గానికి ఒక ఏడాదిలో 3500 ఇళ్లు నిర్మించనున్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తే వివాదాలు లేకుండా ప్రక్రియ పూర్తి చేయవచ్చనే ఆలోచన ప్రభుత్వం ఉంది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను స్క్రూట్నీ చేసి లబ్ధిదారులను ఎంపిక, ఇటు ఇళ్లపై అధ్యయనం అన్నీ మూడు నెలల్లో పూర్తి చేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నిశ్చయించింది ప్రభుత్వం.

## రుణమాఫీపై కొత్త గైడ్ లైన్స్

వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా కటాఫ్ తేదీ ఎలా ఉంటుందనే దానిపై చర్చ జరుగుతోంది. దీనికితోడు ఏకకాలంలో రైతుల రుణమాఫీ ఎలా సాధ్యమవుతుందనేది కూడా చర్చనీయాంశంగా మారింది. దీనిపై ప్రతిపక్ష పార్టీల నుంచే అనేక ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అయితే రేవంత్ సర్కార్ మాత్రం.... ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తామని చెబుతున్నారు. రూ. 2 లక్షల రుణమాఫీ కోసం రూపొందించే విధివిధానాలపై సర్కార్ ఇప్పటికే ప్రాథమికంగా ఓ అంచనాకు వచ్చినట్లు సమాచారం. అయితే ఈ వారంలోనే మంత్రివర్గం సమావేశం అవుతుందని తెలుస్తోంది. ఇందులో ప్రధానంగా రుణమాఫీపై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమవుతున్నారని ప్రభుత్వ వర్గాల మేరకు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న రుణాలు ఎన్ని...? కటాఫ్ తేదీని నిర్ణయించటం, అధిక సంఖ్యలో రైతులకు లబ్ధి చేకూర్చే మార్గాలపై కేబినెట్ భేటీలో చర్చించే అవకాశం ఉంది. దాదాపు ఈ సమావేశం తర్వాత.... కీలక ప్రకటన వెలువడే ఛాన్స్ ఉంది. అయితే రుణమాఫీ గైడ్ లైన్స్ విషయంలో ప్రభుత్వం సరికొత్త ఫార్ములాను కూడా పరిశీలిస్తోందని సమాచారం..!రుణమాఫీ స్కీమ్ లో లబ్ధిదారులుగా ఎవరిని గుర్తించాలి..? ఎలాంటి రుణాలకు ఈ స్కీమ్ ను వర్తించాలనే దానిపై కూడా సర్కార్ పలు ఆలోచనలు చేస్తోంది. అయితే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి స్కీమ్ మార్గదర్శకాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ స్కీమ్ లో కింద అర్హులైన రైతులందరికీ ప్రతి ఏడాది రూ.6 వేల పంట పెట్టుబడి సాయం అందిస్తోంది.

అయితే ఈ స్కీమ్ ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పన్నులు చెల్లించే వారికి వర్తించదు. కేవలం రైతులకు మాత్రం వర్తిస్తుంది. ఇక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో పలు పదవుల్లో ఉండే వారిని కూడా ఈ స్కీమ్ ను మినహాయించారు. వీటితో పాటు మరికొన్ని మార్గదర్శకాలు కూడా ఈ స్కీమ్ కు సంబంధించి ఉన్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్ ) మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుంటే ఎలా ఉంటుంది..? ఫలితంగా అసలు రైతులకు మేలు జరుగుతుందా..? ఈ స్కీమ్ ను విజయవంతంగా అమలు చేయటంలో ఈ గైడ్ లైన్స్ ఎంతవరకు పని చేస్తాయనే దానిపై కూడా తెలంగాణ ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఇవే కాకుండా.... రుణమాఫీ డబ్బులను ఏ విధంగా చెల్లించాలనే దానిపై కూడా సర్కార్ పలు ఫార్ములాలను పరిశీలించినట్లు సమాచారం.

ప్రభుత్వం ముందు అనేక మార్గాలు ఉండగా.. వీటిన్నింటిపై కేబినెట్ లో సమగ్రంగా చర్చించి... ఓ నిర్మయం తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. రేపోమాపో కేబినెట్ భేటీకి సంబంధించి ప్రకటన వెలువడే అవకాశం ఉంది. మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే.... ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

## కేటీఆర్, హరీష్ కు నోటీసులు..?

నివేదిక, సాధ్యమైనంత త్వరగా పూర్తిస్థాయి నివేదికను అందించాలని రెండు కమిటీల ఇంజినీర్లను కమిషన్ ఆదేశించింది. టెక్నికల్ అంశాలపై అఫిడవిట్ ఫైల్ చేయాలని నిపుణుల కమిటీలకు సూచించింది. అఫిడవిట్ల పరిశీలన తర్వాత బహిరంగ విచారణ చేసేందుకు జస్టిస్ పీసీ ఘోష్ సిద్ధమవుతున్నారు. ఇందులో సంబంధం ఉన్న వారికి నోటీసులు ఇచ్చేందుకు గ్రౌండ్ వర్క్ కూడా ప్రిపేర్ చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ నీటిపారుదల మంత్రి హరీష్కు నోటీసులు ఇచ్చే అవకాశాలున్నట్టు టాక్ వినిపిస్తోంది. మరోవైపు.. విజిలెన్స్ ఇచ్చిన మధ్యంతర నివేదిక సమర్పించాలని గతంలోనే కమిషన్ ఆదేశించినా.. అది ఇప్పటివరకు చేరలేదు. రిపోర్ట్ వెంటనే సమర్పించాలని మరోసారి ప్రభుత్వానికి, విజిలెన్స్ విభాగానికి లేఖ రాయనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ ఆకస్మిక పర్యటనలకు వెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. టెక్నికల్ అంశాల తర్వాత ఆర్థిక అంశాలపై కమిషన్ దృష్టి సారించనుంది కమిషన్. ఆనకట్ట నిర్మాణ అంచనాలు, రుణాలు, వడ్డీ రేట్లపై విచారణ చేయనుంది. విచారణలో భాగంగా ఇటీవల L అండ్ T, నవయుగ, ఆఫ్కాన్ కన్స్ట్రక్షన్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యాయి. ఆరోపణలపై కమిషన్ వివరణ కోరగా.. తమకు టైం బౌండ్ పెట్టారని నిర్మాణం కంపెనీలు చెప్తున్నాయి.. ప్రభుత్వం విధించిన సమయంలో ప్రాజెక్టు పూర్తిచేసి అందించామని అంటున్నాయి. ఇదే విషయం అఫిడవిట్ రూపంలో సమర్పించాలని కమిషన్ సూచించింది. అఫిడవిట్ లో సమాచారంతో విచారణను తప్పుదోవ పట్టించాలని చూస్తే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని అధికారులను హెచ్చరించింది కమిషన్. కాళేశ్వరం ప్రాజెకట్పై రిపోర్ట్ ఇచ్చేందుకు జూన్ 30న డెడ్ కావడంతో నిర్మాణ కంపెనీలు, అధికారులు, సంబంధిత వ్యక్తుల నుంచి అన్ని వివరాలు సేకరిస్తోంది కమిషన్. శుక్రవారం మరికొంతమంది అధికారులను, ఇతర వ్యక్తులను విచారించనుంది కమిషన్.

# రక్తదానం చేయండి ప్రాణ దాతలు కండి

▸ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్:**



నువ్విచ్చే రక్తం మరొకరి జీవితం ఒకరి దానం ఒకరి ప్రాణం రక్తదానం చేయండి. ప్రాణదాతలు కండి అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నాచారం ESI Hospital లో రక్తదాన దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబరాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం యొక్క ప్రాముఖ్యత ప్రాణాలను కోల్పోయిన వేలాది మంది జీవితాలను కాపాడడమే కాదు, అనేక వ్యాధుల బారిన పడిన మరెంతో మంది ప్రాణాలను కాపాడటానికి మరియు అనేక వ్యాధులతో పోరాడటానికి వారికి సహాయం చేస్తుంది. ప్రజలు తమ రక్తాన్ని దానం చేసినప్పుడు, వారు అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందారని కూడా గమనించబడింది.

రక్తదానం చేసే చాలా మంది వ్యక్తులు వారి వ్యాధుల నుండి త్వరగా కోలుకుంటారు, మరియు ఎక్కువ కాలం జీవించగలుగుతారు, ఇది బరువు తగ్గడానికి, ఆరోగ్యకరమైన కాలేయం, ఐరన్ స్థాయిని నిర్వహించడానికి, గుండెపోటు మరియు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, BRS పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, హాస్పిటల్ సూపింటెండెంట్ Dr కమల, డాక్టర్స్, BRS పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## శామీర్ పేట్ లో అభివృద్ధి పనులకు ఎంపిపి శ్రీకారం

▸ సమస్యల పరిష్కారంలో ముందుడి పనిచేస్తా - ఎంపీపీ ఎల్లు బాయి బాబు

**జయభేరి, జూన్ 13:**

గ్రామాలను అన్నీ రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తామని శామీర్ పేట్ ఎంపీపీ ఎల్లుబాయి బాబు అన్నారు. శామీర్ పేట్ మండల కేంద్రంలో సుమారు 8లక్షల 30 వేల రూపాయల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎంపీపీ భూమి పూజ చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పాఠశాలలు, అంగన్ వాడి కేంద్రాల్లో మరమ్మతు పనులు చేపట్టినట్లు వివరించారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా పనిచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సాయిబాబా, మండల కో ఆప్షన్ సభ్యులు ముజిబొద్దిన్, ప్రత్యేక అధికారి విజయ లక్ష్మి, సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్య, డైరెక్టర్ భూమిరెడ్డి, పంచాయితీ కార్యదర్శి మౌనిక, మాజీ వార్డు సభ్యులు ఉప్పలయ్య, జ్యోతి, సరిత, నిర్మల, శేఖర్, బాబు, డేవిడ్, రవి, శ్రీనివాస్, చిన్న బాబు, సాయి, పెద్ద బాబు, రమేష్, కృష్ణ, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## దేవరయంజల్ లో పర్యటించిన మున్సిపల్ కమిషనర్

▸ కాలువాలపై ఆక్రమణలు ఉపేక్షించేది లేదు -మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్



**జయభేరి, జూన్ 14:**

మేడ్చల్ జిల్లా తుంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ 16వ వార్డు శ్రీ సాయి మహాలక్ష్మి రెసిడెన్సీ కాలని ప్రతి సంవత్సరం వర్షాలకు ముంపునకు గురవుతున్నాయి. కాగా దీనిపై దృష్టి సారించిన అధికారులు అప్రమత్తం అయ్యారు. దీంతో మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్, మండల సర్వేయర్ యాదగిరి, మున్సిపల్ డిప్యూటీ ఇ ఇ సునీత కలిసి కాలనిలో పర్యటించి ముంపునకు గురయ్యే ప్రాంతాలను పరిశీలించారు. వరద నీటి కాలువ మరియు మెయిన్ రోడ్ పై ఉన్న కల్వర్టు వద్ద సహజ వరద నీటి పరివాహక ప్రాంతాల్లో మరియు కాలువలపై ఏవైనా ఆక్రమణలు ఉన్న కూడా వాటిని గుర్తించి వెంటనే ఆ ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. ఇక మ్యాన్ హోల్స్ వద్ద మ్యాన్ హోల్ కవర్ లు సరిగ్గా ఉన్నావా లేదా వాటిని పరిశీలించి నూతన కవర్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. అంతే కాక సహజ వరద నీటి పరివాహక ప్రాంతం, కాలువాలపై పూర్తి నివేదిక వచ్చిన తర్వాత పరివాహక ప్రాంతంలో ఎవరైనా ఆక్రమించి నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తే వారిపై వాల్ట చట్టం కింద చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని మున్సిపల్ కమిషనర్ స్పష్టం చేశారు.





## ఈ పదవికి న్యాయం చేస్తా

▸ శ్రీ రామానుజ యాగ్నిక పీఠం శామీర్ పేట్ మండల సహాయ కార్యదర్శిగా హరీష్ ఆచార్య నియామకం

**జయభేరి, జూన్ 13:**

శ్రీ రామానుజ యాగ్నిక పీఠం శామీర్ పేట్ మండల సహాయ కార్యదర్శిగా హరీష్ ఆచార్య నియమితులయ్యారు. ఈ మేరకు బ్రహ్మ శ్రీ తిరుమల మనోహరచార్య ఒక ప్రకటనలో వెల్లడించారు. లాల్ గడి మలక్ పేట్ గ్రామంలోని ఆంజనేయ స్వామీ దేవాలయంలో హరీష్ ఆచార్య అర్చకులుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు శ్రీ రామానుజ యాగ్నిక పీఠం శామీర్ పేట్ మండల సహాయ కార్యదర్శిగా నియమించినందుకు ఎంతో సంతోషంగా ఉందని, నాపై నమ్మకంతో ఈ పదవి భాధ్యతలు అప్పగించినందుకు కృత నిశ్చయంతో పని చేస్తానని వెల్లడించారు.

## తై బజార్ వేలం



**జయభేరి, మేడ్చల్ :**

గుండ్ల పోచంపల్లి పురపాలక సంఘ కార్యాలయంలో చైర్ పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం తై బజార్ వసూళ్ళ వేలం కమిషనర్ వి.రాములు ఆధ్వర్యంలో 202425 ఆర్థిక సంవత్సరానికి అనగా 15.06.2024 నుండి 31.03.2025 వరకు గాను తై బజార్ వసూళ్ళ హక్కును బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో డప్పు మల్లికార్జున్, సుంకు రమేష్, కొయ్యాడ మల్లేష్ లు పాల్గొని అత్యధికముగా రూపాయలు 7,02,000/ ఏడు లక్షల రెండు వేల రూపాయలకు పాట పాడి డప్పు మల్లికార్జున్ వేలము దక్కించుకున్నారు. తదుపరి మూడు నెలల అడ్వాన్స్ చెల్లించిన పిదప వర్క్ ఆర్డర్ జారీ చేయనైనది. ఇట్టి వేలము కార్యక్రమములో వైస్ చైర్మన్ డి.ప్రభాకర్, కౌన్సిలర్స్ బేరి బాలరాజు, అమరం జైపాల్ రెడ్డి, అమరం హేమంత్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్, మున్సిపల్ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## పాఠశాల హెచ్ఎంకు స్వాగతం



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ మండలంలోని రాజబొల్లారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా నియమితులైన ఆదిల్పాష కు శుక్రవారం గ్రామ యువకులు స్వాగతం పలికారు. పాఠశాలలో హెచ్ఎంను సన్మానించిన యువకులు పాఠశాలలోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కోరారు. పాఠశాలకు తమ సహకారం ఎల్లప్పుడు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యువకులు సాయిబాబా, నాగార్జున, రాజ్బాబు, కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలి


▸ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని నాగారం కమిషనర్ కు పిర్యాదు

**జయభేరి, జూన్ 14, :**

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్.ఎల్. నగర్ రాంపల్లి ప్రధాన రహదారిపై ఆర్టీసీ కాలనీ సర్వే నెంబర్ 408లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా భవనం నిర్మిస్తున్నారని దీనికి ఎలాంటి అనుమతులు లేవని శ్రీనాథ్ గౌడ్ అనే వ్యక్తి ఆరోపించారు. దీనిపై నాగారం మున్సిపాలిటీ కమిషనర్ రాజేంద్ర కుమార్ కు, అధికారులకు ఎన్నిసార్లు పిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో అనేక అక్రమ కట్టడాలు వెలుస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ పట్టించుకోవడం లేదని శ్రీనాథ్ తెలిపారు. అక్రమ నిర్మాణాలపై మేడ్చల్ జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేశానని ఇప్పటికైనా మున్సిపాలిటీ పరిధిలో వెలిసిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.





2. నిర్మాణ అనుమతులు ఉన్నట్లైతే, నిర్మాణ అనుమతి నెంబర్, రశీదు నెంబర్లు, నాగారం మున్సిపల్ ఉన్నత అధికారులచే ఇప్పించగలరని మనవి.

3. గృహ నిర్మాణలు అన్ని నిబంధనలకు లోబడే జరుగుతుందా ? నిభందనలను ఉల్లంఘించి నిర్మాణము జరుగుతుందా ? ఉల్లంఘించిన నిబందనలు ఏమిటి? వాటిపై నాగారం మున్సిపల్ ఉన్నత అధికారులు ఇప్పటి వరకు ఏమైనా చర్య తీసుకున్నారా? అని నాగారం మున్సిపల్ ఉన్నత అధికారులను విచారించ గలరని మనవి.

ఇట్లు
శ్రీనాథ్
సెల్ నెం. 9100256404.

కలెక్టర్ కార్యాలయము

# ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం ఎంప్లాయిస్ యూనియన్ పోరాటం

**జయభేరి, దేవరకొండ :**

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం అండగా ఉండి పోరాడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంప్లాయిస్ యూనియన్ దేవరకొండ అధ్యక్షులు పల్లా నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ రాష్ట్రంలో 11వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా దేవరకొండ డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ పతాకాన్ని నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డాక ఆర్టీసీ కార్మికుల జీవితాలు బాగుపడతాయని, ఎన్నో ఆశలతో సకలజనుల సమ్మెలో పాల్గొని అగ్రభాగాన పోరాడిన ఆర్టీసీ కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. 2019లో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె నేపథ్యంలో అప్పటి ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ ఆర్టీసీలో సంఘాలను రద్దు చేశారు. ఫలితంగా మూడు సంవత్సరాలుగా ఆర్టీసీలో సంఘాలు లేకుండానే కొనసాగుతోంది. దీంతో కార్మికులు తమ సమస్యలు చెప్పుకునేందుకు, నిరసనలు తెలియజేసేందుకు అవకాశం లేకుండా పోయింది. సంఘాలు పెట్టుకునే హక్కులు కూడా లేకుండా చేశారని అన్నారు. ఆర్టీసీ ఏర్పాటు నుంచి ఎంప్లాయిస్ యూనియన్ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఎన్నో చట్టాలను సాధించిందని తెలిపారు. నూతనంగా ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీని బలోపేతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిపల్లా దేవేందర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు మైనుద్దీన్, డిపో కార్యదర్శి డివి నారాయణ, యాదయ్య ,పాండురంగ చారి, విజయ రెడ్డి, జానీ భారీ, మన్సూర్, నయీమ్, పల్లా రంగా రెడ్డి, నూనె వెంకటేశ్వర్లు, జే వెంకట్రాములు, కృష్ణా రెడ్డి, రాజమల్లయ్య, మల్లేశం, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.




## అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

▸ కొత్త వ్యక్తులు సంచరించినట్లయితే సమాచారం అందించండి - సీఐ శ్రీనాథ్




**జయభేరి, జూన్ 14:**

దొంగల ముఠా (గుర్తు తెలియని వ్యక్తులతో) జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని శామీర్ పేట్ సీఐ శ్రీనాథ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. హయత్ నగర్ , శివారు పరిసర ప్రాంతాల్లో నిన్నరాత్రి సమయంలో ధార్ అనే భయంకరమైన దొంగల ముఠా సంచరిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ఉత్తరప్రదేశ్ కు చెందిన ఐదు నుంచి ఆ పైన వ్యక్తులు దొంగల ముఠాగా ఏర్పడి పట్టణ, శివారు ప్రాంతాల్లో చిన్న చిన్న లాడ్జీల్లో తాత్కాలికంగా నివాసం తీసుకుంటారని పేర్కొన్నారు. ఈ గ్యాంగ్ వ్యక్తులు పగలు సమయంలో రక్కి చేసుకుని తాళం వేసిన ఇండ్లు, నగర శివారు ప్రాంతాల్లో నివసించే ఇండ్లను, గేటెడ్ కమ్యూనిటీలో నివసించే విల్లాలు, అపార్ట్మెంట్లను పగటి సమయంలో షేరింగ్ ఆటోలో తిరుగుతూ పరిశీలన చేసి టార్గెట్ పెట్టుకుని రాత్రి సమయంలో మెయిన్ గేట్ నుంచి కాకుండా కాంఫౌండ్ వాళ్ళు దూకి ఇంటి మెయిన్ డోర్ కొట్టి డోర్ తీయగానే ఇంట్లో ఉన్న వ్యక్తులను కొట్టి, చంపి కూడా ఇళ్లలో ఉన్న బంగారం, నగలు ఇతర విలువైన వస్తువులు దోచుకుని వెళ్తారని పేర్కొన్నారు. మండల ప్రజలకు శామీర్ పేట్ పోలీసుల తరపున ఒక విజ్ఞప్తి చేశారు. ఎవరైనా రాత్రి పూట తలుపు తడితే ఎట్టి పరిస్థితుల్లో మీరు తలుపు తీయకుండా 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వచ్చిన వ్యక్తుల్ని కిటికిలోంచి చూసి మీ కాలనీ వాసులను అప్రమత్తం చేయాలని, కాలనీలో అనుమానంగా ఎవరైనా వ్యక్తులు సంచరిస్తుంటే శామీర్ పేట్ పోలీసులు, 100 నెంబరు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రభాత జయభేరి



## ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

- గుండ్లపోచంపల్లి ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులతో అక్షరాభ్యాసం
- బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

**జయభేరి, మేడ్చల్ :**

కార్పోరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం గుండ్లపోచంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులతో అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు బోధన అందిస్తారని తల్లిదండ్రులు బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాములు, వైస్ ఛైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, అమరం హేమంత్ రెడ్డి, భేరి బాలరాజు, మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సురేందర్ గౌడ్, జనార్ధన్ రెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీలు



**జయభేరి, మేడ్చల్ :**

రవాణా శాఖ ఆధ్వర్యంలో మేడ్చల్ జాతీయ రహదారిపై స్కూల్ బస్సులు, వాహనాలను ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్స్పెక్టర్ బాబు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పలు స్కూల్, ఇంజనీరింగ్ కాలేజ్ బస్సులపై ఆర్టీఓ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఫిట్నెస్ లేని వాహనాలు, సరైన ధృవపత్రాలు లేని 10 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

## విత్తన షాపుల్లో విస్తృత తనిఖీలు

- ఏ ఓ రాంజీ నాయక్



**జయభేరి, బయ్యారం :**

బయ్యారం మండలంలోని రామచంద్రపురం కొత్తపేట మరియు బయ్యారంలో జిల్లా వ్యవసాయ అధికారి మీ అభిమన్యుడు, మండల వ్యవసాయ అధికారి బి రాంజీ ఐదు విత్తన షాపుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరిగినది. రామచంద్రపురంలో సనా ట్రేడర్స్ అదేవిధంగా శ్రీరామ ఫెర్టిలైజర్స్ సీడ్స్ అలాగే సాయిబాబా ట్రేడర్స్ గంధంపల్లి లో బయ్యారంలో లక్ష్మి ఫెర్టిలైజర్ ఫెస్ట్రేడ్స్ మరియు సీడ్స్ సొసైటీలో కూడా స్టాగ్ రిజిస్టర్, ఇన్వైబిల్స్ ,సీడ్ గోదాములు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్, జియో టి, రైతు వారి 12 కాలమ్స్ ప్రొఫార్మా వెరిఫై చేయడం జరిగినది అదేవిధంగా ఎరువుల ఈపాస్ మెషిన్లను కూడా తనిఖీలు నిర్వహించడం జరిగింది క్లస్టరే ఏఇఓ అఖిల్ కుమార్, కొత్తపేట క్లస్టర్ ఏ ఈ ఓ కే .పూజిత పాల్గొనడం జరిగినది, నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే అనతరైజుడ్ గల విత్తనాలు అమ్మినట్లయితే చర్య తీసుకోబడును.

## ఉత్తమ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డు

- హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ దాసరి రుణాదేవి



**జయభేరి, దేవరకొండ :**

పట్టణానికి చెందిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ దాసరి రుణాదేవి గత 20సంవత్సరాలుగా వృత్తి నిత్య అసాధారణమైన సామాజిక సేవకు గుర్తింపుగా బహుజన సాహిత్య అకాడమీ వారు ఉత్తమ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డుతో సత్కరించారు. జూన్ 10వ తేదీ మహారాష్ట్రలోని పూణేలో జరిగిన నాలుగవ సమావేశంలో బహుజన సాహిత్య అకాడమీ ద్వారా ఈ అవార్డు పొందారని తెలిపారు. జాతీయ చైర్మన్ నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా ఉత్తమ జాతీయ అవార్డు పొందడం సంతోషంగా ఉందని, ఈ అవార్డు పొందడం పూర్వజన్మ సుకృతం అని అన్నారు. ఇంతటి గొప్ప అవార్డుకు తనను ఎంపిక చేసినందుకు సెలక్షన్ కమిటీ మెంబర్ డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ కు మరియు బహుజన అకాడమీ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్లో మహారాష్ట్ర మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, గోవాల రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది డెలికేట్స్ హాజరయ్యారని తెలిపారు. ఈ అవార్డుతో నేను మరింత ఉత్సాహంతో సామాజిక ఉద్యమాలలో చురుగ్గా పాల్గొని,ప్రజలకు చేరువై అన్ని వర్గాలను కలుపుకొని పోయి సేవ చేస్తానని అన్నారు.

## వాసవి మాత సన్నిధిలో చీరల ప్రసాదం

**జయభేరి, దేవరకొండ :**

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవి జయంతి రోజున వాసవి మాత ఉయ్యాల ఉత్సవములో అమ్మవారు వాసవి మాత ఉయ్యాలలో ఊగిన ఉయ్యాలకు మూడు చీరలు అలంకరణ చేసిన చీరలను వాసవి మాత సన్నిధిలో ప్రసాదంగా ఇవ్వడం జరిగినది. మిరియాల సంతోషిని, బెల్లె వాసవి, గుద్దేటి అనూష ఆలయ కమిటీ వారు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పానుగంటి మల్లయ్య, అధ్యక్షులు చీదెళ్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిసముద్రాల ప్రభాకర్, కోశాధికారికొత్త సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎంతోమంది విద్యార్థులకు మార్గదర్శకులు

- గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన సముద్రాల శ్రీనయ్య

**జయభేరి, దేవరకొండ :**

జాతి యావత్తు గర్వించే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి గత 35 సంవత్సరాలుగా ఎందరో విద్యార్థుల జీవితాలలో జ్ఞాపక జ్యోతులు వెలిగించి, తమ వ్యక్తిత్వముతో ఉపాధ్యాయ వృత్తికే వెన్నె తెచ్చిన అక్షర యోధులు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సముద్రాల శ్రీనయ్య(శ్రీనివాస్) గుడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన శుభ సందర్భంగా తోటి ఉపాధ్యాయ బృందం పూలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది మాట్లాడుతూ తమ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా ఉండి అంకితభావంతో పనిచేస్తూ, ఎందరో విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దారని, ఉపాధ్యాయ వృత్తిలో తమ అమూల్యమైన సేవలు అందించి ఆప్యాయతకు, అనురాగానికి, నిలువుటద్దామై,చిరు మందహాసంతో అందరినీ పలకరించే వారని అన్నారు. విద్యార్థులకు చక్కని సూచనలు, సలహాలతో ఎంతోమంది విద్యార్థులకు మార్గదర్శకులై,ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని అన్నారు. అటువంటి ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లడం చాలా బాధగా ఉందని తోటి ఉపాధ్యాయులు విద్యార్థులు పలికారు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తన విద్యాబోధన ద్వారా మరింత మందికి విద్యార్థులకు సేవలు అందించాలని ఉపాధ్యాయులు కోరారు.ఈ సందర్భంగా సముద్రాల శ్రీనయ్య(శ్రీనివాస్) మాట్లాడుతూ ఉద్యోగి జీవితంలో బదిలీలు తప్పనిసరి అని,ఎక్కడ పని చేసినా వారి సేవలు,జ్ఞాపకాలు మాత్రమే మదిలో శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. ఉపాధ్యాయుల వల్లే ప్రతి మనిషి సంఘంలో ఏదో ఒక మంచి గౌరవ స్థానానికి ఎదుగుతారని, అందుకే ఉపాధ్యాయుని ప్రత్యేకతను పూర్తిస్థాయిలో గుర్తించి ఉపాధ్యాయులకు ఎంతో ప్రాముఖ్యతను ఇస్తారని అన్నారు. ఉపాధ్యాయుల బోధన వారి క్రమశిక్షణ వల్ల విద్యార్థి జీవితంలో నుండి తన జీవితంలో మంచి ఏదో,చెడు ఏదో తెలుసుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటారని అన్నారు. విద్యార్థులకు సైతం ప్రభుత్వ పాఠశాలలో నిష్టాతులై ఉన్న ఉపాధ్యాయులు మంచి బోధన అందించి వారు కూడా ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. తల్లిదండ్రులు, విద్యార్థులకు జన్మనిస్తే విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతంగా రేపటి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు.





# అన్ని రంగాలలో అభివృద్ధి పథం దిశగా..

- చేరిపల్లి శ్రీనివాస్ కు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి

**జయభేరి, దేవరకొండ :**

పట్టణంలోని ప్రముఖ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చేరిపల్లి శ్రీనివాస్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారు. కొండమల్లే పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంచార్జ్ ఉపాధ్యాయులుగా ఉన్నకాలంలో పాఠశాలకు కావలసిన అదనపు సౌకర్యాల గురించి తనదైన శైలిలో పోరాటం చేసి, విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించారు. ఉపాధ్యాయ వృత్తిలో గత 35 సంవత్సరాలుగా ఆయన చేసిన సేవలకు గాను కలెక్టర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించారు. తన విద్య బోధన ద్వారా మరింత మంది విద్యార్థులకు సేవలు అందించాలని పలువురు కోరారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, తన విద్య బోధన ద్వారా మరింత మంది విద్యార్థులకు సేవలు అందించాలని తోటి ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా చేరిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని,అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని అన్నారు.





పాఠశాలను అన్ని రంగాలలో అభివృద్ధి పథం దిశగా డివిజన్ పాఠశాలకు ఉత్తమ ఫలితాలు అందించేందుకు అందర్నీ కలుపుకొని సమిష్టిగా కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండి క్రమశిక్షణ కలిగిన విద్యను నేర్పించినట్లయితే వారు సమాజంలో మంచి పౌరులుగా నిలుస్తారని అన్నారు. మంచి సమాజం ఏర్పడాలంటే ఉత్తమ గుణాలు ఉన్న పౌరులుగా ఎదగాలని, అలాంటి పౌరులు ఎదగడానికి పాఠశాలలో ఉపాధ్యాయులు నేర్పే ఉత్తమ విద్య తోడ్పడుతుందని అన్నారు.

# గోవును జాతీయ ప్రాణిగా గుర్తించాలి

- గోవుల రక్షణ చట్టాలు అమలు చేయాలని వినతి పత్రం అందజేత
- మూగజీల సేవా సంఘం మంచిర్యాల జిల్లా

**జయభేరి, మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కు గోవధ గోరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన. మంచిర్యాల జిల్లా మూగజీవుల సేవా సంఘం సభ్యులు. మూగజీవుల సేవా సంఘం అధ్యక్షుడు కటుకం నాగరాజు కమిటీ సభ్యులతో కలిసి గోరక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ సబావత్ మోతీలాల్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం కటుకం నాగరాజు మాట్లాడుతూ గోవులను అన్యాక్రాంతంగా తరలించే వారిపట్ల చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా జిల్లాలో అనేకచోట్ల అనుమతి లేకుండా నిర్వహించబడుతున్న కబేళాలను మూసివేసేలా చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1977 సం"లో గోవధ నిషేధ చట్టం తీసుకొచ్చినప్పటికిని పూర్తి స్థాయిలో అమలు కావడంలేదన్నారు. ముఖ్యంగా మహారాష్ట్ర నుండి పెద్ద మొత్తంలో ఎటువంటి అనుమతులు లేకుండా కంటేనర్, లారీలు వంటి వాహనాలలో గోవులను అతికిరాతకంగా హింసకు గురిచేస్తూ పరిమితికి మించి కదలలేని స్థితిలో బాధకు గురిచేస్తూ యదేచ్ఛగా హైదరాబాద్ లోని కబేళాలకు రవాణా చేయడం జరుగుతుందన్నారు. హిందువుల ఆరాధ్యదైవం ముప్పై మూడు కోట్ల దేవతల నిలయంగా పూజించే గోవులను రక్షించుకోవడం మనందరి బాధ్యత అని గుర్తుచేసారు. ఇప్పటికైనా గోవుల అక్రమ రవాణా జరుగకుండా ఎక్కడికక్కడ చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మూగజీవుల సేవా సంఘం అధ్యక్షుడు కటుకం నాగరాజు, ఉపాధ్యక్షుడు మర్రి స్వామి, విశ్వహిందూ పరిషత్ మంచిర్యాల జిల్లా గోరక్షక్ ప్రముఖ్ రాజసమ్మయ్య, వేముల హరిప్రసాద్, తోట కార్తీక్, శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.







## ఫోటోగ్రాఫర్ పై దాడి చేసిన వారిని కచ్చితంగా శిక్షించాలి

- మన్న మణిదీప్ నేత

**జయభేరి, దేవరకొండ :**

మునుగోడు నియోజకవర్గంలోని సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన ఫోటోగ్రాఫర్ లింగస్వామి పై ముక్కుమ్మడి దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని దేవరకొండ ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మన్న.మనిదీప్ నేత డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పుట్టపాక గ్రామంలో సారీ ఫంక్షన్ కి ఫోటోగ్రాఫర్ గా పూలమోని లింగస్వామి వెళ్లి ఫోటోలు తీస్తున్న సమయంలో బంధువుల తరపున వచ్చిన చుట్టాలు స్టేజిపై నిల్చొని ఉన్న వారిని ఫోటోలు తీయమని అదే గ్రామానికి చెందిన బొల్లెపల్లి రాఘవేంద్ర పురుషోత్తం ఫోటోగ్రాఫర్ కు మొబైల్ ఫోన్ ఇస్తే ఫోటోగ్రాఫర్ మొబైల్ లో ఫోటోలు తీయందున బంధువులు ఏకమై ఫోటోగ్రాఫర్ పై దాడి చేశారని వాపోయారు. ఫోటోగ్రాఫర్ కు తీవ్ర గాయాలు అవడంతో పోలీసులను ఆశ్రయించారని అన్నారు. ఈ దాడికి పాల్పడ్డ వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను కోరారు.భవిష్యత్తులో ఇలాంటి అనుచిత దాడులు మారెవరిపై జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. బాధితుడు లింగస్వామికి ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్లు అందరూ ఐక్యమత్యంగా అండగా నిలిచి న్యాయం చేయాలని కోరారు. ఫోటోగ్రాఫర్ లింగస్వామికి దేవరకొండ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ తరపు నుండి పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. శుభకార్యాలలో ఫోటోగ్రాఫర్లు తమ పనిలో నిమగ్నమై ఉన్నప్పుడు చరవానిలో ఫోటోలు దింపడం వృత్తి ధర్మం కాదని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని ఈ సందర్భంగా ప్రజలను తెలిపారు.

## పలు కాలనీల అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

**మేడ్చల్ :**

అల్వాల్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు డివిజన్ ల కాలనీ, బస్తీల లలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు అల్వాల్ సర్కిల్ మున్సిపల్ ఇన్చార్జి డిప్యూటీ కమిషనర్ కి వినతి పత్రాలు అందజేసి అభివృద్ధి పనుల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్వాల్ సర్కిల్ డివిజన్లోని పలు కాలనీ బస్తీలలో ప్రజా సమస్యను తన దృష్టికి తీసుకురాగా సంబంధిత మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్, జోనల్ కమిషనర్ ,డిప్యూటీ కమిషనర్, ఉన్నతాధికారులకు తెలియజేశానని. సమస్యలు పరిష్కరించాలని.. బీటీ,సీ సీ రోడ్ ప్యాచ్ వర్క్ లు పలు కాలనీలలో బాక్స్ డ్రైనేజీ, స్ట్రోమ్ వాటర్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు కమ్యూనిటీ హాళ్లు నిర్మాణం, చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, చెరువులలో గుర్రపు డెక్క తొలగించాలని, వంటి పలు అభివృద్ధి పనుల గురించి కులంకషంగా చర్చించి నూతన అభివృద్ధి ప్రతిపాదనలను సిద్ధం చేసి, టెండర్ అయి మధ్యలో ఆగిపోయిన పనులను పునరుద్ధరించుటకై, టెండరై ప్రారంభించబోయే పనుల కోసం, జరుగుతున్న పనులను, గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ మున్సిపల్ సర్కిల్ ఇన్చార్జి డిప్యూటీ కమిషనర్ మల్లయ్య (మల్లారెడ్డి) ఈ.ఈ శ్రీ కాంతి, టౌన్ ప్లానింగ్ ఏసిపి సాంబయ్య, డి.ఈ. కార్తీక్, రంజిత్ కుమార్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్లు అరుణ్, వివిధ శాఖల మున్సిపల్ అధికారులు, జీహెచ్ ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ అల్వాల్ కార్పొరేటర్ శ్రీమతి శాంతి శ్రీనివాస్ రెడ్డి, వెంకటాపురం కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంజినీరింగ్‌పై దృష్టి సారించే మానవ సంబంధాల సమావేశం

- ఒక నూతన చొరవ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థులు తమ భవిష్యత్ ఉద్యోగులను కలుసుకునే మానవ సంబంధాల కాన్క్లేవ్ - ఫార్వర్డ్ ఇంజనీరింగ్
- ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థులు తమ భవిష్యత్ ఉద్యోగులను కలుసుకుంటారు, తద్వారా విద్యార్థులను వాస్తవ-ప్రపంచ హెచ్‌ఆర్ సవాళ్లు ఎదుర్కొని, వినూత్న పరిష్కారాల వైపు దృష్టి

**జయభేరి, హైదరాబాద్, జూన్ 14:**

ఫ్యూచర్‌ఫార్వర్డ్ ఇంజినీరింగ్‌పై దృష్టి సారించే మానవ సంబంధాల సమావేశం ఫార్వర్డ్ ఇంజనీరింగ్ హెచ్‌ఆర్ కాన్క్లేవ్ శనివారం నగరంలోని చిల్కూరు రోడ్డులోని అప్పా జంక్షన్ సమీపంలోని VJIT (విద్యా జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) లో జరగనుంది. బీకాన్ 2024 పేరుతో, ఏహెచ్ ఆర్ కాంక్లేవ్ WOW ఏహెచ్ ఆర్ భాగస్వామ్యంతో జరుగుతుంది. ఇది ఇంజనీరింగ్ మరియు MBA విద్యార్థుల మొత్తం కెరీర్ అభివృద్ధిపై దృష్టి పెడుతుంది. విద్యార్థులు నేరుగా పరిశ్రమ నిపుణులతో ముఖాముఖీ క్రిచించు కోవడానికి ఇది ఒక అరుదైన అవకాశం ఇది. VJIT 25వ సంవత్సర వేడుకల్లో భాగంగా ఈ కాన్క్లేవ్ నిర్వహించబడుతుంది. కళాశాల ప్రకారం, కాన్క్లేవ్ యొక్క లక్ష్యాలు, పరిశ్రమ నిపుణుల నుండి విద్యార్థులు జ్ఞానాన్ని సముపార్జించుకోవడం, ఇంటర్న్‌షిప్‌లు, మెంటర్‌షిప్, ఉద్యోగ నియామకాలకు దారితీసే సంబంధాలు పెంపొందించడం, విద్యార్థులను వాస్తవప్రపంచ ఏహెచ్ ఆర్ సవాళ్లు, వినూత్న పరిష్కారాల వైపు దృష్టి సారించడం. Epam Systems, Disney Star, Virtusa, ServiceNow, Hyd Metro, Berkadia Group, Campus Hiring, HR Innovator, Simens EDA India, Deluxe India, BP, Flutter Entertainment LLC, Hexaware Technologies వంటి పరిశ్రమల నిపుణులు పాల్గొంటారని భావిస్తున్నారు. ఇంజనీరింగ్‌లో పని భవిష్యత్తుపై ఫైర్‌సైడ్ చాట్ జరుగుతుంది. రెండు ప్యానెల్‌ల చర్చలు జరగనున్నాయి. ఒక ప్యానెల్ గైడింగ్ GenZ పవర్ ఆఫ్ కోచింగ్‌పై దృష్టి పెడుతుంది. మరొకటి విద్యార్థులకు సాధికారత నావిగేటింగ్ డిస్ట్రప్టివ్ టెక్నాలజీ మీద చర్చిస్తుంది. డాక్టర్ E. సాయిబాబా రెడ్డి, VJIT ప్రిన్సిపాల్, WOW ఏహెచ్ ఆర్ నుండి కృతివాసన్ S కాన్క్లేవ్‌కు అతిథులుగా హాజరుకానున్నారు. మొత్తం 200 మంది పాల్గొనే అవకాశం ఉంది. మేకా వెంకట చలపతి సీనియర్ డైరెక్టర్, హెడ్ ఏహెచ్ ఆర్, విర్ధుస ఫైర్‌సైడ్ చాట్‌ని మోడరేట్ చేస్తారు.



# స్వర్ కోకిల లతా మంగేష్కర్ అవార్డుతో సత్కారం

- సూర్మండల్, తెలంగాణ టూరిజం ప్రస్తుతానికి JNAFAUలో హిందుస్థానీ క్లాసికల్ రిసైటల్
- ఏఆర్ రెహమాన్‌కు ఇష్టమైన శాస్త్రీయ సంగీత విద్వాంసుడు రోంకిణి గుప్తా హైదరాబాద్‌లో ప్రదర్శన ఇవ్వనున్నారు

**జయభేరి, హైదరాబాద్, జూన్ 14:**

జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ (JNAFAU)లో శనివారం జూన్ 22వ తేదీ 6.30 గంటలకు రోంకిణి గుప్తా యొక్క హిందుస్థానీ క్లాసికల్ రిసైటల్‌ను ప్రదర్శించడానికి తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణా టూరిజం సహకారంతో సుర్మండల్ సాయంత్రం. 25 సంవత్సరాలకు పైగా సంగీత శిక్షణతో, రోంకిణి గుప్తా నిష్ణాతుడైన గాయకుడు. మాస్ట్రో AR రెహమాన్ తరచుగా ఆమెను తన అభిమాన శాస్త్రీయ సంగీత విద్వాంసుడు అని పిలిచేవారు. ఆమె మూడుసార్లు ఫిలింఫేర్ ఉత్తమ మహిళా నేపథ్య గాయనిగా నామినేట్ చేయబడింది. ఆమె తుమ్హారీ సులులోని చార్ట్‌బస్టర్స్ "రఫు", 'సూయి ధాగా' చిత్రంలోని చావ్ లాగా' మూడవ పాట 'తుల జప్నార్ ఆహే' ఆమెకు జీ టాకీస్ మహారాష్ట్ర 2020లో ఇష్టమైన గాయని అవార్డు. ఆమె ఇటీవల స్వర్ కోకిల లతా మంగేష్కర్ అవార్డుతో సత్కరించబడింది. రోహిణి గుప్తాతో పాటు టేబుల్‌పై ఆశిష్ రాగ్వానీ, హార్మోనియంపై దీపక్ మరాఠే ఉన్నారు. ఆశిష్ రగ్వానీ, అనుప్ జలోటా, పండిట్ వంటి ప్రముఖులతో పాటు ఉన్నారు. అతను అనేక పండుగలలో భాగమయ్యాడు. అతను బాల ప్రాడిజీ. దీపక్ మరాఠే ప్రఖ్యాత సంగీత విద్వాంసులు పండిట్, జయతీర్థ మేవుండి, పద్మశ్రీ హరిహరన్, ఉస్తాద్ రషీద్ ఖాన్, అనూప్ జలోటా చాలా మంది ఉన్నారు. ప్రదర్శన టిక్కెట్లు ఆన్‌లైన్‌లో www.bookmyshow.comలో అందుబాటులో ఉన్నాయి.





# వర్షా కాలంలో స్టైలిష్‌గా కనిపించాలంటే..

వానాకాలంలో సరైన జాగ్రత్తలు తీసుకుంటేనే మీరు స్టైలిష్‌గా కనిపిస్తారు. ఇందుకోసం కొన్ని సింపుల్ చిట్కాలు ఉన్నాయి. వాటి కోసం ఎక్కువగా ఖర్చు కూడా అవ్వదు.

వర్షాకాలం భారీ వర్షం తరచుగా మనల్ని తడిపేస్తుంది. అయితే సౌకర్యవంతంగా, పొడిగా ఉండటానికి సరైన దుస్తులను ఎంచుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా వర్షాకాలంలో మీ దుస్తులను ఎంచుకునేటప్పుడు గుర్తుంచుకోవలసిన కొన్ని విషయాలు ఇక్కడ ఉన్నాయి.

**పొడిగా ఉండే బట్టలు :** పాలిస్టర్ లేదా నైలాన్ వంటి త్వరగా ఆరే బట్టలను ఎంచుకోండి. ఇవి మిమ్మల్ని పొడిగా, అదే సమయంలో సౌకర్యవంతంగా ఉంచడంలో సహాయపడతాయి. కాటన్ బట్టలు మానుకోండి, ఎందుకంటే అవి నీటిని పీల్చుకుంటాయి పొడిగా అవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది.

**ఏ రంగు దుస్తులు వేసుకుంటారు?** మీరు దుస్తుల రంగులను ఎన్నుకునేటప్పుడు ఎల్లప్పుడూ లేత రంగులను ఎంచుకోవద్దు. ఎందుకంటే అవి మిమ్మల్ని మళ్లీ చల్లబరుస్తాయి. ముదురు రంగులతో పోలిస్తే అవి మరకలను చూపుతాయి. ఎల్లప్పుడూ తెలుపును ఎంచుకోండి. ఎందుకంటే ఇవి త్వరగా ఆరిపోతాయి.

**గొడుగులు వాడండి:** వర్షం నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి గొడుగు లేదా రెయిన్ కోట్ ఉపయోగించండి. మీ పాదాలను పొడిగా ఉంచడానికి వాటర్‌ప్రూఫ్ బూట్లు కూడా మంచి ఎంపిక. బరువైన బట్టలు ధరించవద్దు. వర్షాకాలంలో డెనిమ్ లాంటివి వేసుకోవద్దు. జీన్స్ వేసుకుని తడిస్తే.. అవి ఆరడానికి చాలా సమయం పడుతుంది. తడిగా ఉన్నప్పుడు అసౌకర్యంగా ఉంటాయి. మెరుగైన సౌలభ్యం కోసం తేలికైన బట్టలకు వాడండి. జాకెట్ కింద తేలికపాటి T షర్టు ధరించండి. ఈ విధంగా మీరు ధరించడం ద్వారా మీ శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవచ్చు.


**లాంగ్ ప్యాంట్ వద్దు :** లాంగ్ ప్యాంటు తేలికగా తడిసి బరువుగా మారుతుంది. బదులుగా షార్ట్స్, క్యాప్రిస్ లేదా స్కర్ట్‌లను ఎంచుకోండి. ఈ ఎంపికలు తడి పరిస్థితుల్లో మరింత బాగుంటాయి, అనుకూలమైనవి.

**ఏ చెప్పులు ధరించాలి?** తోలు బూట్లు లేదా నీటితో పాడైపోయే చెప్పులు ధరించడం మానుకోండి. నీటిని పీల్చుకోకుండా ఉండే ఫుట్ వేర్ వాడాలి. సులభంగా శుభ్రం చేయడానికి రబ్బరు, ప్లాస్టిక్ పాదరక్షలను ఎంచుకోండి.

**బిగుతు దుస్తులు వద్దు :** కాటన్ గాలి ప్రసరణను అనుమతిస్తాయి. చెమటను నిరోధిస్తాయి. ఇది తేమతో కూడిన పరిస్థితులలో కూడా చల్లగా, సౌకర్యవంతంగా ఉండటానికి మీకు సహాయపడుతుంది. బిగుతుగా ఉండే బట్టలు ధరించవద్దు, తడిగా ఉన్నప్పుడు బిగుతుగా ఉండే బట్టలు ధరించడం వల్ల అసౌకర్యం, శరీరం అలెర్జీకి గురయ్యే అవకాశం ఉంది. మెరుగైన గాలి ప్రసరణ, సౌకర్యాన్ని కల్పించే వదులుగా ఉండే దుస్తులను ఎంచుకోండి. వర్షాకాలంలో చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. యాంటీ ఫంగల్ పౌడర్‌ని ఉపయోగించొచ్చు.

**ఉపకరణాలు నిర్లక్ష్యం చేయవద్దు :** మీ ఉపకరణాలను వానాకాలంలో నిర్లక్ష్యం చేయవద్దు. నీటితో అవి పాడైపోతాయి. బయటకు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ కవర్ తీసుకెళ్లండి. ఒక జత బట్టలు కూడా అందుబాటులో ఉండాలి. రోజంతా మిమ్మల్ని సౌకర్యవంతంగా ఉంచుతూ పొడి దుస్తులను మార్చుకోవడానికి మీకు సహాయపడుతుంది. వర్షాకాలంలో వివిధ ఇన్ఫెక్షన్లు సంభవించవచ్చు. మీ దుస్తులను క్రమం తప్పకుండా ఉతికి ఆరబెట్టండి.

వర్షాకాలంలో మీ చర్మ ఆరోగ్యానికి బట్టలు కూడా ముఖ్యమైనవి. వాటిని సరిగా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు వాష్ చేస్తూ ఉండాలి. ఒక్కసారి వేసుకుని.. వర్షంలో తడిసిన తర్వాత మళ్లీ వాటిని ఉతికి మాత్రమే వేసుకోవాలి. చాలా మంది వానలో తడిసిన బట్టలను ఎండలో ఆరబెట్టి వేసుకుంటారు. కానీ ఇది మంచి పద్ధతి కాదు. బట్టలు వాసన కూడా వస్తాయి.






# మలయాళ మెగాస్టార్ సినిమాలో సమంత. ?

మలయాళ నటుడు మమ్ముట్టి ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. 72 ఏండ్ల వయసులో కూడా వరుస సినిమాలు చేస్తూ.. కుర్ర హీరోలకు కాంపీటిషన్‌గా నిలుస్తున్నాడు. ఈ ఏడాది మమ్ముట్టి నటించిన భ్రమయుగం, టర్బో చిత్రాలు సూపర్ హిట్‌ను అందుకున్నాయి. అయితే ఈ మెగాస్టార్ ప్రస్తుతం తమిళ దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్‌తో ఓ చిత్రం చేయబోతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పోస్ట్ ప్రోడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ చిత్రం త్వరలోనే పట్టాలెక్కబోతుంది. అయితే ఈ సినిమాలో హీరోయిన్‌కు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ ప్రాజెక్ట్‌లో కథానాయికగా టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే దీనికి సంబంధించి చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. యాక్షన్ థ్రిల్లర్‌గా రానున్న ఈ చిత్రం 2024 ఎండింగ్‌లో విడుదల కానున్నట్లు తెలుస్తుంది. ఇక గౌతమ్ వాసుదేవ్ మీనన్ దర్శకత్వంలో వచ్చిన ఏమాయ చేసావే సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది సమంత. ఆ తర్వాత అతని డైరెక్షన్‌లోనే ఎటో వెళ్లిపోయింది మనసు సినిమా చేసింది. ఇక ఈ సినిమా సామ్ ఒకే అంటే గౌతమ్ మీనన్‌తో హ్యాట్రిక్ చిత్రం కాబోతుంది. మరోవైపు సామ్ కొన్ని రోజులుగా సినిమాలకు దూరంగా విషయం తెలిసిందే. తన చివరి తెలుగు చిత్రం విజయ్ దేవరకొండతో నటించిన ఖుషి. మయోసైటిస్‌తో భాదపడుతున్న సామ్ ఇప్పుడిప్పుడే కోలుకుంటుంది.






# ఈవెంట్‌కు కేరళ యూనివర్సిటీ నిరాకరణ..

బాలీవుడ్ స్టార్ నటి సన్నీ లియోన్ కు షాక్ తగిలింది. ఆమె తలపెట్టిన ఓ డ్యాన్స్ ఈవెంట్‌కు కేరళ యూనివర్సిటీ నిరాకరించింది. తిరువనంతపురంలోని కార్యవట్టం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో జులై 5న సన్నీలియోన్ డ్యాన్స్ ప్రదర్శన నిర్వహించాలని భావించారు. అయితే, ఈ ప్రదర్శనకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ మోహనన్ కున్నుమ్మల్ అనుమతి నిరాకరించారు. ప్రోగ్రామ్ జాబితా నుంచి సన్నీ లియోన్ ప్రదర్శనను తీసేయాలని వర్సిటీ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. క్యాంపస్ లోపల, బయట ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిచేందుకు యూనియన్‌ను అనుమతించబోమని స్పష్టం చేశారు. అయితే, గతేడాది కొచ్చిన్ యూనివర్సిటీలో చోటు చేసుకున్న విషాద ఘటనల నేపథ్యంలో వర్సిటీల్లో డీజే పార్టీలు, మ్యూజిక్ నైట్స్ వంటి కార్యక్రమాలపై ప్రభుత్వం బ్యాన్ విధించింది. గతేడాది కొచ్చిన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన మ్యూజిక్ కన్సర్ట్‌లో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో నలుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోగా.. సుమారు 64 మంది స్టూడెంట్స్‌కి గాయాలయ్యాయి. ఈ ఘటనను కేరళ హైకోర్ట్ తీవ్రంగా పరిగణించింది. నిర్వహణ వైఫల్యం కారణంగానే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు గుర్తించింది. ఈ మేరకు ఇలాంటి ఘటనలు వర్సిటీల్లో పునరావృతం కాకూడదని ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో వర్సిటీల్లో ఇలాంటి ఈవెంట్స్‌పై ప్రభుత్వం బ్యాన్ విధించింది. ఈ ఘటనల నేపథ్యంలోనే తాజాగా సన్నీ లియోన్ ఈవెంట్‌కు వీసీ అనుమతిని నిరాకరించినట్లు స్టేట్ మీడియా తెలిపింది.

# నాలుగురెట్ల వినోదం కోసం.. ఎఫ్4కు రంగం సిద్ధం

వెంకటేష్, వరుణ్‌తేజ్ కథానాయకులుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'ఎఫ్2' 'ఎఫ్3' చిత్రాలు హోల్‌సమ్ కామెడీ ఎంటర్‌టైనర్స్‌గా ప్రేక్షకులకు వినోదాన్ని పంచాయి. 'ఎఫ్3' విడుదల అనంతరం ఈ సినిమా ఫ్రాంఛైజీని కొనసాగిస్తామని నిర్మాత దిల్ రాజు తెలిపారు. ఈ నేపథ్యంలో 'ఎఫ్4' ఎప్పుడు పట్టాలెక్కుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాకు రంగం సిద్ధమైనట్లుగా తెలిసింది. ఈ చిత్రంలో వెంకటేష్, వరుణ్‌తేజ్ పాటు మరో అగ్ర హీరో కూడా నటిస్తారని సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, త్వరలో అధికారిక ప్రకటన వెలువడుతుందని చెబుతున్నారు.





# పరమేశ్వరుడి ఆజ్ఞ 'కన్నప్ప'

'కన్నప్ప ప్రతి తరానికి కనెక్ట్ అవుతుంది. ధూర్జటి విరచిత శ్రీకాళహస్తీశ్వర మహాత్యాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించాం. వివిధ భాషల్లోని అగ్ర నటుల్ని ఈ చిత్రంలో భాగం చేశాం' అన్నారు సీనియర్ నటుడు మంచు మోహన్‌బాబు. శుక్రవారం జరిగిన 'కన్నప్ప' టీజర్ రిలీజ్ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంచు విష్ణు టైటిల్ రోల్‌లో ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మంచు మోహన్‌బాబు మాట్లాడుతూ 'ప్రభాస్ కోసం కృష్ణంరాజు ఈ కథను సిద్ధం చేశారు. మేము అడిగిన వెంటనే ఆయన కథను ఇచ్చారు. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే ఈ సినిమా తీయడానికి ముందుకొచ్చాం. నిర్మాతగా ఈ సినిమా నాకు ఎంతో సంతృప్తినిస్తున్నది' అన్నారు. కన్నప్ప మైథాలజీ చిత్రం కాదని, రెండో శతాబ్దంలో చోళ రాజుల కాలంలో జరిగిన నిజమైన కథ ఇదని, చరిత్రలో నిలిచిపోయే విధంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని మంచు విష్ణు తెలిపారు. అపరశివ భక్తుడి కథగా 'కన్నప్ప' అందరిని ఆకట్టుకుంటుందని దర్శకుడు ముఖేష్‌కుమార్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com